# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 24-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించడం అత్యవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.
- ❖ ప్రాంతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో నరేంద్ర మోదీతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్ లో ఈరోజు సంభాషించారు.
- ❖ రైలు టికెట్ల రద్దు, బోర్డింగ్ స్టేషన్ మార్పునకు సంబంధించి రైల్వే శాఖ నిబంధనలను సవరించింది.
- ❖ ట్రాన్స్‌జెండర్ల హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించడానికి చర్చలు, దౌత్యం అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణపై రాజ్యసభలో ప్రధాని ఈ రోజు మాట్లాడుతూ... ప్రాంతీయ ఉద్రిక్తల నేపథ్యంలో గల్ఫ్ దేశాల నాయకులతో పాటు ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికాలతో టెలిఫోన్ సంభాషణలు జరిపినట్లు తెలిపారు. హర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులు, అంతర్జాతీయ నౌకాయానానికి ఆటంకాలు కలిగించడం ఆమోదయోగ్యం కాదన్నారు. యుద్ధ వాతావరణంలో కూడా భారత నౌకలు సురక్షిత రాకపోకల కోసం దౌత్యమార్గం ద్వారా భారతదేశం నిరంతరం ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. పశ్చిమాసియాలో మూడు వారాలకు పైగా కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమైన ఇంధన సంక్షోభాన్ని సృష్టించిందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా - ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతల వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈరోజు ఫోన్ చేశారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించారు. అలాగే, హర్ముజ్ జలసంధిని తెరిచి ఉంచాల్సిన ప్రాముఖ్యతపైనా చర్చించినట్లు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. పశ్చిమాసియాలో పరిస్థితులపై తమ మధ్య ఉపయోగకరమైన రీతిలో చర్చ సాగిందని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. వీలైనంత త్వరగా ఉద్రిక్తతలను తగ్గించి.. శాంతిని పునరుద్ధరించేందుకు భారత్ మద్దతు ఉంటుందని అమెరికాకు స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. హర్ముజ్ జలసంధిని తెరిచి ఉంచడం, రక్షణ కల్పించడం, అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం యావత్ ప్రపంచానికి అత్యవసరమని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

టికెట్ల రద్దు, బోర్డింగ్ స్టేషన్ మార్పునకు సంబంధించి రైల్వే శాఖ నిబంధనలను సవరించింది. టికెట్ల బ్లాక్ మార్కెటింగ్‌లో దళారుల దందాకు అడ్డుకట్ట వేయడంతో పాటు.. ప్రయాణికులకు మరింత సౌలభ్యం కల్పించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్టు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. న్యూఢిల్లీలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ... ఈ కొత్త నిబంధనలు ఏప్రిల్ 1 నుంచి 15 మధ్య దశలవారీగా అమల్లోకి వస్తాయని తెలిపారు. టికెటింగ్ విధానంలో దళారులు చేస్తున్న మోసాలను అరికట్టేందుకే రిఫండ్ నిబంధనలను కఠినతరం చేసినట్లు అశ్విని వైష్ణవ్ తెలిపారు. సవరించిన నిబంధనల ప్రకారం టికెట్ రద్దు చేసుకునే సమయాన్ని బట్టి రిఫండ్ మొత్తం ఆధారపడి ఉంటుందని కేంద్రమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ట్రాన్స్‌జెండర్ల హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ తెలిపారు. ట్రాన్స్‌జెండర్ల హక్కుల పరిరక్షణ సవరణ బిల్లు-2026ను లోక్ సభలో ఆయన ఈ రోజు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ బిల్లు ట్రాన్స్‌జెండర్ల హక్కులతో పాటు సంక్షేమానికి వీలు కల్పిస్తుందని చెప్పారు. ఈ బిల్లు ప్రకారం తనను ట్రాన్స్‌జెండర్‌గా గుర్తించి ధృవీకరణ పత్రం జారీ చేయమని జిల్లా మేజిస్ట్రేట్‌కు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. సామాజిక పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్న ట్రాన్స్‌జెండర్లకు అండగా ఉండడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న సంఘర్షణల నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని న్యూ ఢిల్లీలో ఈరోజు నిర్వహించారు. ముఖ్యంగా హర్ముజ్ జలసంధి ద్వారా జరుగుతున్న ప్రపంచ వాణిజ్య మార్గాలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న తరుణంలో ఈ సమీక్ష జరిగింది. ఈ సమావేశానికి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి హాజరయ్యారు. రక్షణ రంగం కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (DRDO) ఛైర్మన్ సమీర్ వి. కామత్, రక్షణ ఉత్పత్తి విభాగం కార్యదర్శి సంజీవ్ కుమార్ కూడా హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రభుత్వం చేపట్టిన నిరంతర కృషి ఫలితంగా దేశంలోని రైతుల ఆదాయం గణనీయంగా పెరిగిందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. లోకసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన అనుబంధ

ప్రశ్నలకు మంత్రి ఈ రోజు సమాధానమిస్తూ.. రైతుల ఆదాయాలు పెరిగాయని చెప్పారు. గతంలో కేవలం సుమారు 19,306 కోట్ల రూపాయలుగా ఉన్న వ్యవసాయ బడ్జెట్.. ప్రస్తుతం లక్షా 30 వేల కోట్ల రూపాయలకు పైగా పెరిగిందని ఆయన గుర్తు చేశారు. అదే విధంగా 2014 నుండి దేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి 44 శాతం మేర పెరిగిందని పేర్కొన్నారు. `ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి` పథకం కింద, రైతులకు ఏటా 6 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తున్నట్లు శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వ్యక్తులు మాత్రమే షెడ్యూల్డ్ కులం హోదాను పొందేందుకు అర్హులని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఒక ఉత్తర్వును సమర్థిస్తూ... క్రైస్తవ మతం వంటి ఇతర మతాలకు మారడం వల్ల షెడ్యూల్డ్ కుల హోదాను తక్షణమే పూర్తిగా కోల్పోతారని పేర్కొంటూ ఈ రోజు తీర్పు వెలువరించింది. ఒక వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారి ఆ మతాన్ని అనుసరిస్తే అతనిని షెడ్యూల్డ్ కుల సభ్యునిగా పరిగణించలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. క్రైస్తవ మతంలోకి మారిన దళిత వ్యక్తి షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల చట్టం కింద రక్షణ పొందలేరని జస్టిస్ పి. కె. మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. 1950 నాటి రాజ్యాంగ ఉత్తర్వుల ప్రకారం ఈ నిబంధన స్పష్టంగా నిర్ధారించబడిందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అప్రాప్రియేషన్ బిల్లు-2026 పై చర్చను రాజ్యసభ ఈ రోజు తిరిగి ప్రారంభించింది. ఈ బిల్లు 2026-27 ఆర్థిక సంవత్సరపు సేవల కోసం భారత సంఘటిత నిధి నుండి నిర్దిష్ట మొత్తాల చెల్లింపు, కేటాయింపునకు అధికారం కల్పించాలని కోరుతోంది. చర్చ అనంతరం ఈ చట్టాన్ని లోక్‌సభకు తిరిగి పంపనున్నారు. దిగువ సభ గత వారం ఈ చట్టాన్ని ఆమోదించింది. ఈ చర్చలో పాల్గొన్న బీజేపీకి చెందిన ఎంపీ డాక్టర్ దినేష్ శర్మ మాట్లాడుతూ... "ఈ చట్టం కేవలం ఒక ఆర్థిక ప్రక్రియ మాత్రమే కాదని... దేశ అభివృద్ధి ప్రయాణానికి, పారదర్శకతకు, జవాబుదారీతనానికి కీలకమైన పునాది అని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో కూడా భారతదేశ ఎగుమతులు వృద్ధి చెందుతూనే ఉన్నాయని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయాన్ని ఈరోజు వెల్లడించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ మొత్తం ఎగుమతులు 714 బిలియన్ల డాలర్ల స్థాయిని అధిగమించాయని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా పలు అవగాహన కార్యక్రమాలను ఈ రోజు నిర్వహించారు. క్షయవ్యాధి వల్ల సంభవించే అనారోగ్య పరిస్థితుల గురించి తెలియచేసేందుకు ప్రతి సంవత్సరం మార్చి 24న ఈ దినోత్సవాన్ని పాటిస్తారు. క్షయవ్యాధిని నియంత్రించడంలో దేశం గణనీయమైన పురోగతి సాధించిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన సందేశంలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 132వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = =